క్లుప్తంగా

నేడు బాబా మందిరంలో దత్త జయంతి

మండవల్లి: మండవల్లిలో ఉన్న దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం దత్త జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు గుడివాడ చిట్టిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు దత్తాత్రేయ స్వామివారికి ప్రత్యేక పూజలు, సిద్ధమంగళస్తోత్ర పారాయణం, అనంతరం సామూహిక అనఘాష్టమి వ్రతాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం ఏడు గంటల నుంచి పల్లకి ఉత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అఖండ దీప ధ్యానం



గుడివాడ టౌన్: స్థానిక శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బ్రహ్మర్షి పితామహ పత్రీజి ఆశీస్సులతో అఖండదీప ధ్యానం శుక్రవారం నిర్వహించారు. పౌర్ణమిరాత్రి ధ్యానంలో భాగంగా జ్యోతి వెలిగించి బ్రహ్మర్షులకు హారతులు ఇచ్చారు. అనంతరం కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ధ్యాన కేంద్ర నిర్వాహకురాలు రాజకుమారి తెలిపారు.

శబరిమల తరలిన స్వాములు



గుడ్లవల్లేరు: మండలంలోని వెణుతురుమిల్లి, సింగలూరు, గుడ్లవల్లేరు ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు శనివారం శబరిమల బయలుదేరారు. గుడ్లవల్లేరు సత్యదేవుని ఆలయంలో ఈ స్వాములకు గురుస్వాములు బచ్చు ఆంజనేయులు, వల్లెపు బుజ్జి, చుక్కల జగన్నాథం కేరళ సాంప్రదాయ పద్ధతిలో ఇరుముళ్లను కట్టారు. స్వాములను సాగనంపేందుకు వచ్చిన బంధుమిత్రులతో ఆలయ ప్రాంతమంతా కిటకిటలాడింది. బాణసంచా కాలుస్తూ కనక డప్పుల వాయిద్యాలతో మాలధారులు ఊరేగింపుగా శబరిమల తరలివెళ్లారు.

అంగన్‌వాడీల్లో టాయిలెట్స్ నిర్మాణం

గుడ్లవల్లేరు: జిల్లాలో సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.60.48 లక్షలతో టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సువర్ణ తెలిపారు. సాక్షితో ఆమె ఫోన్లో మాట్లాడారు. ఒక్కో టాయిలెట్‌ను రూ.36 వేల నిధులను ఖర్చు చేసి అంగన్‌వాడీల వద్ద జిల్లాలో 168 టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

వెలమ సంఘం ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు

గుడివాడ టౌన్: వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ ప్రజల ప్రయోజనం కోసం నాలుగు ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. చేపలమార్కెట్ వద్ద రెండు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద రెండు బెంచీలు ఏర్పాటు చేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గోర్జి సత్యనారాయణ, ఆసుపత్రి ఆర్ఎంఓ కృష్ణదొర, పంచకర్ల వెంకట్, జి. ప్రభాకరరావు, వి. శ్రీనివాసరావు, పూడి సుధాకర్, బ్రాహ్మాజి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకశిలా నాట్య స్థూప ప్రతిష్ట

కూచిపూడి(మొవ్వ): నాట్య క్షేత్రం కూచిపూడిలో శనివారం వేకువ ఝామున పండితుల మంత్రోచ్చరణల మధ్య సాంప్రదాయ మంగళ వాయిద్యాల నడుమ నాట్యాచార్యులు, యువ కళాకారులు పర్యవేక్షణలో 50 అడుగుల ఏకశిలానాట్య స్థూపాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లక్ష్మీ గణపతి హోమం దేవాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్, ప్రవాస భారతీయులు డాక్టర్ వేదాంతం వెంకట నాగచలపతిరావు (వెంకు), రాష్ట్రపతి అవార్డు గ్రహీత నాట్యాచార్య, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళాపీఠం ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతారవిబాల కృష్ణ,శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం పాలక మండలి అధ్యక్షుడు కావూరి భానుమూర్తి, కూచిపూడి నాట్య హెరిటేజ్ సొసైటీ నిర్వాహకులు, యువ నాట్యాచార్యులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఊరేగింపు

కైకలూరు: భవానీమాత నామస్మరణతో కైకలూరు శనివారం మార్మోగింది. వందలాది మంది భవానీ మాలధారులు స్థానిక శ్యామలాంబ దేవాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు కనకదుర్గామాత ఆలయం వరకు జ్యోతులతో ప్రదర్శనగా వెళ్లారు. మాలధారులతో పాటు కుటుంబ సభ్యులు నడిచారు. గురు భవానీ బందా చంద్రశేఖర్ మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా ప్రతి ఏటా జ్యోతుల ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు.

వెలుగులిచ్చే విద్యుత్ శాఖకు నీడ కరవు!

- శిథిలావస్థలో క్వార్టర్స్, కార్యాలయం
- అవస్థలు పడుతున్న సిబ్బంది

గుడ్లవల్లేరు: ప్రజలకు వెలుగులు ఇచ్చే విద్యుత్ శాఖ వారికి తల దాచుకునేందుకు క్వార్టర్స్‌తో పాటు కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరిపోయి నీడ కరువైంది. మండల పరిధిలోని కౌతవరం విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోనే దాదాపు 40 ఏళ్ల క్రితం ట్రాన్స్‌కో సిబ్బందికి లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో క్వార్టర్స్‌ను నిర్మించారు. ఏఈతో సహా సిబ్బంది అంతా రాత్రింబవళ్లు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నివశించే విధంగా నివాస వసతులను కల్పించింది. కానీ ఇపుడు ఆ ఆశయం నెరవేరటం లేదు. గత పదేళ్లగా క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే కనబడటం లేదు. భవనాల్లో పిచ్చిచెట్లు మొలిశాయి. భవనాల కలప చోరీకి గురైనా పట్టించుకోవటం లేదు. క్వార్టర్స్‌లో పాములు, తేళ్లు, మండ్రగప్పలు రాజ్యమేలుతున్నాయి. నూతనంగా క్వార్టర్స్‌ను నిర్మించటమే తప్ప ఇప్పుడున్న భవనాలకు రిపేర్లు చేయించాలన్నా శ్లాబులు కూలిపోయి, గోడలు బీటలు వారి ఉన్నాయి. సిబ్బంది అంతా ఏఈతో సహా బయట అద్దెకు ఉంటున్నారు. సబ్ స్టేషన్ కార్యాలయంలో అన్ని గదులు శ్లాబులు పగిలిపోయి వర్షాలకు కారిపోతున్నాయి. తలుపులు, కిటికీలు వర్షానికి నానిపోయి పుచ్చిపోతున్నాయి. సబ్ స్టేషన్‌లో కాకుండా బయట ఇల్లు అద్దెకు తీసుకోవటంతో జీతంతో పాటు హెచ్ఆర్ ఇచ్చినా నెల అద్దెలో కొంత ఉద్యోగుల చేతి డబ్బులు పడుతున్నాయని ఏఈ గోవింద్ తెలిపారు. స్థానికంగా నివాస యోగ్యం ఉంటే సబ్ స్టేషన్‌లో ఏ సమయంలోనైనా ప్రజలకు ఉపయోగపడే విధంగా పని చేయవచ్చన్నారు. సబ్ స్టేషన్ కార్యాలయం కూడా పూర్తిగా పాడైపోయి శిథిలావస్థకు చేరి వర్షాల్లో కారిపోతుందని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విద్యుత్‌శాఖకు భవనం సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



చిట్టడవిలా ఏఈ క్వార్టర్‌ను కమ్మేసిన చెట్లు



శిథిలావస్థలో లైన్‌మన్ క్వార్టర్స్



పుట్టెడు కష్టాల్లో సబ్ స్టేషన్ కార్యాలయం

రాజీమార్గమే రాజమార్గం



కక్షిదారులకు పరిష్కారపత్రాలు అందజేస్తున్న జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం



మొవ్వ కోర్టులో లోక్ అదాలత్

గుడివాడ టౌన్: రాజీమార్గంలో కేసులు పరిష్కారం చేసుకోవడం ఎంతైనా మంచిదని 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో మెగా లోక్ అధాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారాన్ని దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులకు తిరిగి కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు కనుక ఇరుపక్షాల కక్షిదారులకు ఇది మంచి చేస్తుందన్నారు. అదాలత్‌లో -సివిల్ 13, క్రిమినల్ 1438, ఇతర 3, ఎక్సైజ్ కేసులు 109 పరిష్కారమయ్యాయని చెప్పారు. వాటి విలువ రూ. 2,20,23,053 అని వెల్లడించారు. మొత్తం 1563 కేసులు పరిష్కరించామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వాసుదేవ్, మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి. గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 213 కేసులకు పరిష్కారం

మొవ్వ: మొవ్వ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 213 కేసులకు పరిష్కారం లభించింది. ఆ న్యాయస్థానం న్యాయమూర్తి పి.రాజన్ ఉదయ్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో చల్లపల్లి, ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలో 70 చొప్పున 140, కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో 37, మొవ్వ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 36 కేసులకు రాజీ మార్గం ఏర్పడి పరిష్కారమయ్యాయి. న్యాయవాదులు గొాగ్రిపర్తి శ్రీనివాసరావు, మారం సరస్వతి, పి.రాధాకృష్ణ, కక్షిదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు: రాజీమార్గమే రాచమార్గమని కైకలూరు సీనియర్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలు వీవీఎన్ వీ.లక్ష్మీ, ఎం.శివకిరణ్ చెప్పారు. కైకలూరు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ క్షణికావేశంలో చిన్నచిన్న తప్పులు చేసి కోర్టులు చుట్టూ తిరగడం వల్ల కాలం, ధనం వృథా అవుతుందన్నారు. అదాలత్‌లో తీర్పు సుప్రీం కోర్టుతో సమానమన్నారు. అనంతరం క్రిమినల్, చెక్‌బౌన్స్, మనోవర్తి, గృహహింస, ఎక్సైజ్, సివిల్ వంటి 668 కేసులను అదాలత్‌లో పరిష్కరించారు. వివిధ ఫైన్‌లు, వేలం, సీజ్‌లు, కక్షిదారులకు చెల్లింపుల నిమిత్తం రూ.1,43,81,430 నగదు జమ అయిందని కోర్టు సిబ్బంది తెలిపారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక పటిష్టతకు దోహద పడతాయని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ 44వ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం నిర్వహించారు. వివిధ వయస్సు గ్రూపులకు ఈ పోటీలు జరిగాయి. 100, 200, 800, 1500, 5కె పరుగుపందెం, త్రోబాల్, షాట్‌పుట్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, నడక వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మడకా ప్రసాద్, మాస్టర్స్ అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి ఎంవీ ప్రసాదు, అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాదు, ఆర్గనైజర్ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బతుకుపోరులో బాల్యం



బతుకు వేటకు వెళ్తున్న బాల కార్మికులు



పొట్ట పోసుకోవడానికి నిత్య జీవన పోరాటం

బడిలో ఉండాల్సిన బాల్యం బుగ్గిపాలవుతోంది. రెక్కాడితే గానీ డొక్కాడని అత్యంత పేద కుటుంబాల్లోని పిల్లలను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. బడిలో ఉంటూ అక్షరాలు దిద్దాల్సిన చేతులు వలలు పట్టి చేపలు పడుతున్నారు. గుడ్లవల్లేరులో కొందరు నిత్యం చేపలవేటకు వెళతారు. పిల్లలను సైతం తమ వెంట తీసుకెళతారు. పొట్టపోసుకోవడానికి నిత్య జీవన పోరాటం తప్పదని అంటున్నారు.

- గుడ్లవల్లేరు

లంకపల్లికి డాక్టరేట్ ప్రదానం



కురుమద్దాలి(పామర్రు): ప్రముఖ విద్యావేత్త సామాజిక కార్యకర్త జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లంకపల్లి శ్రీనివాసరావుకు హోలీ స్పిరిట్ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేసింది. హైదరాబాద్ హోలీ స్పిరిట్ విశ్వ విద్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు డాక్టరేట్ అందుకున్నారు. గతమూడు దశాబ్దాలకు పైగా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, ఇప్పటికీ సుమారుగా 6,000 మందికి పైగా విద్యార్థులు, గృహిణులను దూరవిద్య ద్వారా డిగ్రీలు చేయించి ఎంతో మందికి ఉచితంగా చేసిన విద్యాదానాలను గుర్తించి తనకు డాక్టరేట్ ఇవ్వడం సంతోషంగా ఉన్నదని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ సయ్యద్ , బిషప్ ఆనంద్, డాక్టర్ అబ్రహం, కుసుమ బోగ రాజు, కిషోర్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ పునఃప్రతిష్ఠ



కైకలూరు: రామస్మరణతో రాచపట్నం, హరిజనవాడ ప్రాంతం మార్మోగింది. టీటీడీ శ్రీవాణి ద్వారా రాచపట్నం రామాలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారు. దీంతో పాత రామాలయం స్థానంలో నూతన రామాలయ పునఃప్రతిష్ఠ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కుల, మతాలకు అతీతంగా అందరూ పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ అల్లూరి మంగారావు, ఈదా రాజు, కిషోర్, పండుబాబు, ఎలిషారావు, మాదెం కృష్ణరావు, యలవర్తి శివాజీ, సాయల మంగరావు, ఈదా బాబూరావు, బుర్ల హరిబాబు, దండే నాగరాజు, అల్లూరి కొండ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గీతాపారాయణ ప్రవచనం



అనుగ్రహ భాషణం చేస్తున్న దృశ్యం

నిమ్మకూరు(పామర్రు): గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ వేదాంతం రాధాకృష్ణమూర్తిచే గీతా పారాయణ ప్రవచనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గీతాజయంతి పారాయణ కార్యక్రమాలు ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. రోజూ భగవద్గీతలో ఒక అధ్యాయం పారాయణం చేసి దాని గురించిన ప్రవచనాలు రాధా కృష్ణమూర్తి చెబుతారని పేర్కొన్నారు. శ్రీ కృష్ణ భగవానుడు బోధించిన గీతా సారాంశాన్ని భక్తులకు అర్థమయ్యే రీతిలో వివరిస్తారని చెప్పారు. తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి ఎస్.రఘునాథ్, టీటీడీ కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

'అమ్మో చలిపులి'



ఎంఎన్‌కే రహదారిపై పొగమంచు



చలి మంట వద్ద చిన్నారులు



చిన్నారులకు సైతం తప్పని చలికోట్లు, మంకీ క్యాప్‌లు

సాయంత్రం అయ్యిందంటే చాలు.. చలిపులి బయటకు రాకుండా చేస్తుంది. ఎముకలు కొరికే చలితో జోరున కురుస్తున్న పొగమంచు దుప్పటి శనివారం గుడ్లవల్లేరును కమ్మేసింది. పొగమంచు ఉదయం ఎండ రాకుండా తెల్లగా మసక బారినట్లుగా అలముకుంది. లైట్లు ఉంటే గానీ ఎదుట వస్తున్న వాహనాలు కనబడలేదు. ఈ పొగమంచు పంజా దెబ్బకి జనం చలి కోట్లు, మంకీ క్యాప్‌లు లేకుండా బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఇంకా తట్టుకోలేని వారు చలిమంటలు వేస్తున్నారు.

- గుడ్లవల్లేరు

కష్టమర్లపై భారం పడనివ్వం



వివరాలు వెల్లడిస్తున్న కీర్తన సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.దినేష్

కైకలూరు: బ్రాంచ్ మేనేజర్ చేసిన మోసం కారణంగా కష్టమర్లపై భారం మోపమని కీర్తన ఫిన్సర్వ్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.దినేష్ స్పష్టం చేశారు. కై కలూరు బ్రాంచ్ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ 2022లో కై కలూరులో బ్రాంచీని ప్రారంభించామన్నారు. ఇక్కడ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన రుద్రపాటి సూర్యం 79 మందికి రూ.45 లక్షలు రుణాలు మంజూరు చేసి బ్యాంకు అకౌంటుగా జమ చేయించారన్నారు. తర్వాత కష్టమర్ల వద్దకు వెళ్లి పొరపాటున మీ అకౌంటులో నగదు పడినాయని చెప్పి తిరిగి వాటిని వసూలు చేశాడన్నారు. ఆ సమయంలో ఇదే సంస్థలో వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్న సూర్యం బాబై రుద్రపాటి స్కైలాబ్ కష్టమర్లకు ఫోన్‌చేసి పొరపాటున వచ్చిన నగదు ఇవ్వకపోతే అతని ఉద్యోగం పోతుందని నమ్మబలికాడన్నారు. వీరిద్దరూ ఈ ఏడాది మార్చిలో ఉద్యోగం మానివేశారన్నారు. తర్వాత అడిట్ చేయించగా అవకతవకలు బయటపడ్డాయన్నారు. కాజేసిన డబ్బులతో అనుమానం రాకుండా నెలనెలా రూ.20 లక్షలు కట్టారన్నారు. ఇంకా రూ.25 లక్షలు రావాల్సి ఉందన్నారు. వీరిపై ఆగస్టు నెలలో కైకలూరు టౌన్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారన్నారు. కోర్టు ద్వారా రిమాండ్ సైతం విధించారన్నారు. కష్టమర్ల ఆధార్, పాన్, ఈకేవైసీలతో లోన్లు తీసుకుని కాజేసినప్పటికీ కష్టమర్లపై ఎలాంటి భారం లేకుండా నిందితుల వద్ద నుంచే నగదు రికవరీ చేస్తామని చెప్పారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సాల్మన్ కొల్లాబత్తుల

పామర్రు: స్థానిక విస్టాలయం బజారులో సెమీ క్రిస్మస్ వేడుకలను పీటీపీఎఫ్ సభ్యుడు పాస్టర్ ఎంపీ వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ పాల్గొని మాట్లాడారు. లోక రక్షకుడైన ఏసు క్రీస్తు లోక కళ్యాణం కోసం జన్మించాడని తెలిపారు. ఏసు పుట్టుకతోనే క్రీస్తు శకము ప్రారంభమయిందని చెప్పారు. ఏసు ప్రభువు చేసిన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. క్రీస్తు బోధనలు అనుసరించి దయ, క్షమ, శాంతి గుణాలు కల్గి ఉండాలని సూచించారు. తన వలే తన పొరుగు వారిని ప్రేమించాలన్న ప్రభువు సూక్తులను అందరూ ఆచరించాలని కోరారు. అనంతరం క్రిస్మస్ గీతాలు ఆలపించి క్రిస్మస్ క్యాండిల్ సర్వీస్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్.జోషఫ్, వి.సునీల్, డి. క్రీస్తు దాసు, పి.జగదీష్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు



నిమ్మకూరు నీటి సంఘ అధ్యక్షుడిగా అధికారుల నుంచి పత్రాన్ని అందుకుంటున్న గణేష్

గుడివాడ టౌన్: గుడివాడ రూరల్ మండలం నీటి సంఘాల అధ్యక్ష ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. మండలంలోని శేరీగొల్వేపల్లి సంఘం అధ్యక్షుడిగా నూతక్కి కుటుంబరావు, వలివర్తిపాడు లింగంనేని వీర బసవయ్య, మోటూరు చలమలచెట్టి ఉమామహేశ్వరి, తట్టివర్రు ఎన్. శేషుబాబు, రామనపూడి సీహెచ్ శ్రీధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ఎనిమిది సంఘాలకు ఏకగ్రీవం....

పమిడిముక్కల: మండలంలో నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. 8 సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మొత్తం 96 టీసీలకు గాను 77 టీసీలకు ఎన్నికలు జరిగాయని, 19 టీసీలకు ఎన్నికలు జరగలేదని తెలిపారు.

మొవ్వ: మండలంలోని పది నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ప్రతి సంఘానికి 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవం అవ్వగా ఇద్దరిని అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

పది సంఘాలకు ఎన్నికలు...

పామర్రు: మండల పరిధిలోని 10 నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వ నాయకులే అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో పాటు పలువురు టీడీపీ నేతలు అభినందించారు. తహసీల్దార్ రవికాంత్, ఇరిగేషన్ జేఈ సాదిక్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

పెదపారుపూడి: మండలంలోని ఉన్న ఆరు నీటి సంఘాల అధికారులు ఎన్నికల నిర్వహించగా అన్ని చోట్ల ఏకగ్రీవంగా ముగిశాయని తహసీల్దార్ వై. రంగరావు పేర్కొన్నారు.

12 మంది ఏకగ్రీవంగా ఎన్నిక.....

మండవల్లి: మండలంలోని గన్నవరం నీటి సంఘం అధ్యక్షుడిగా కూనపురెడ్డి బాలకోటేశ్వర రావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం గన్నవరం నెంబర్ 74 నీటి సంఘం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పల్లపోతు సహదేవుడు, 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సూర్యకుమారి వ్యవహరించారు.

అడ్డగోలుగా నీటి సంఘం ఎన్నికలు

కలిదిండి(కై కలూరు): కూటమి ప్రభుత్వంలో నీటి సంఘాల ఎన్నికలు అడ్డగోలుగా జరిగాయని కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిట్టూరి మురళీ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారులను అడ్డుపెట్టుకుని పదవులన్నీ నామినేట్ చేసుకున్నారన్నారు. ఈ మాత్రం దానికి ఎన్నికలు ఎందుకు అని ప్రశ్నించారు. నీటి సంఘ ఎన్నికలపై గ్రామాల్లో టముకు వేయించలేదని పేర్కొన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించలేదని, నీటి సంఘ ఎన్నికల్లో రైతులతో సంబంధం లేని కాంట్రాక్టర్లకు సైతం అధ్యక్ష హోదా కట్టబెట్టారన్నారు. తన 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఇటువంటి నీటి సంఘ ఎన్నికలను చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పామర్తి శ్రీరామ్మూర్తి, పామర్తి సీతారామయ్య శనివారం ఎన్నికయ్యారు. టీసీలకు చందన శ్రీనివాసరరావు, యరగాని నాగార్జునరావు, మోదుగుమూడి గంగాధరరావు, కాగిత శివ పార్వతి, బెల్లంకొండ మహంకాళరావు, లుక్కా పోతురాజు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. పెంజెంద్ర సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బొప్పన సుభాష్ చంద్రబోస్, కాసరనేని ప్రసాదరావు ఎన్నికయ్యారు. టీసీలకు కొడాలి రమేష్, పోలగాని ఈశ్వరరావు, కుంపటి కుమార్, బొల్లా శ్రీనివాసరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మల్లా వెంకట నాగరాజు, బొప్పన సురేష్, షేక్ ఖుతుబుద్దీన్, చల్లగుళ్ల మల్లేశ్వరరావు, కాకుళ్ల శేఖర్ ఎన్నికైనట్లుగా అధికారులు ప్రకటించారు. అంగలూరు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బొర్రా మల్లేశ్వరరావు, చాపరాల సుధాకర్ ఎన్నికయ్యారు. విన్నకోట సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అడుసుమిల్లి సీతారాంప్రసాద్, కూనపురెడ్డి నాగరాజు ఎన్నికయ్యారు. విన్నకోట సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడిగా పాలేటి నాగాంజనేయులు, వల్లభనేని రవీంద్ర ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. విజేతలను ఉలవలపూడి గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు తదితరులు పూల మాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.